బైబిలు యొక్క గొప్ప బోధలు

# దేవుని యొక్క పిలుపులు

మానవునితో దేవుని వ్యవహారాల చరిత్ర దేవుడు నరులను పిలిచిన చరిత్రయై ఉంది. దేవుడు నరజాతిని ప్రేమిస్తాడు. ఈ ప్రేమయే తన ప్రజలను వెదకుకొనే రీతిగాను, వారిని పిలుచుకునేటట్టును ఆయనను చేసింది.

## గతంలో ఆయన పిలుపులు

జలప్రళయానికి ముందటి లోకాన్ని నీటి వరదచే శుద్ధీకరించి పవిత్రపరచడానికి నోవహు పిలువబడ్డాడు (ఆది. 6). దేవుడు అవశ్యమైన ఆజ్ఞలనియ్యగా, "దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు" నోవహు చేశాడు (22 వ.). దేవుడు పిలిచినప్పుడు తాను దీవించబడాలంటే, నరుడు విధేయుడు కావాలి.

తన స్వదేశాన్ని వదలిరమ్మని అబ్రాహాము పిలువబడ్డాడు (ఆది. 12:1-4). అతడు విగ్రహారాధన దేశంలో నివసించేవాడు. దానినుండి అతడు సంపూర్ణంగా వేరు చేయబడ డానికిగాను, "నేను నీకు చూపించు దేశమునకు" బయలు వెళ్లుమని ఆయన అతని పిలిచాడు. దేవుని పిలుపునకు అబ్రాహాము లోబడినందున, అద్భుతమైన యితర దీవెనలను ఆయన అతనికి వాగ్దానం చేశాడు. అబ్రాహాము ద్వారా చివరికి భూలోకములోని కుటుంబాలన్నీ ఆశీర్వదించబడతాయి. అబ్రాహాము యొక్క విధేయతలో ఒక గొప్ప జాతి యొక్క ఆరంభాన్ని మనం చూస్తాం.

దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తులోనుండి పిలిచాడు. వారిని బయటికి రప్పించ డానికి ఆయన మోషేను పంపాడు (నిర్గమ. 3:10). అద్భుతమైన ఆశీర్వాదములు వాగ్దానం చేయబడ్డాయి, కాని వారు దేవుని పిలుపునకు లోబడి మోషే నాయకత్వాన్ని అనుసరించడంతో అవి ముడివేయబడ్డాయి. ఐగుప్తు విగ్రహారాధననుండి వారు తమ్మును తాము వేరు చేసికోవాలి. వారిలో కొందరు సీనాయి పర్వతంనొద్ద విగ్రహారాధనకు పాలుపడగా వారు సంహరింపబడ్డారు (నిర్గమ. 32).

అనేక సంవత్సరాల తరువాత, దేవుడు ఇశ్రాయేలీయులను బబులోను చెరలోనుండి పిలిచాడు. డెబ్బై ఏండ్ల తరువాత జయింపబడిన ఇశ్రాయేలీయులు కనానుకు తిరిగివచ్చేలా అనుమతించాడు (యిర్మీయా 29:10). కోరెషు యొక్క ఆజ్ఞ జారీ చేయబడింది, తమ స్వదేశానికి తిరిగి వెళ్లి పరిశుద్ధ పట్టణం తిరిగి కట్టబడేలా అందులో పిలుపు యివ్వబడింది

(2 దినవృ. 36:22, 23). జెరుబ్బాబెలు, ఎజ్రా, నెహెమ్యాల నాయకత్వాలలో అనేకమంది ఇశ్రాయేలీయులు తమ స్వదేశానికి తిరిగి వచ్చి, ప్రాకారాలను తిరిగి కట్టి, దేవాలయాన్ని పునరుద్ధరించారు.

## నేడు ఆయన పిలుపులు

దేవుడు నేడు మనలను పిలుస్తున్నాడు. ఆత్మ సంబంధమైన తన రాజ్యంలోనికి ఆయన మనలను పిలుస్తున్నాడు – చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలుపు.

మనం సువార్త ద్వారా పిలువబడ్డాం (2 థెస్స. 2:14). ఇది అద్భుతమైన, వింతైన పిలుపు కాదు. అది దేవుని వాక్యము ద్వారా పిలువబడే పిలుపు. ఏదో యొక దానిలో నుండి మనం పిలువబడ్డాం:

> అయితే మీరు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు (1 పేతురు 2:9).
>
> తన రాజ్యమునకును మహిమకును మిమ్మును పిలుచుచున్న దేవునికి తగినట్టుగా మీరు నడుచుకొనవలెనని మేము మీలో ప్రతివానిని హెచ్చరించుచు, ... (1 థెస్స. 2:11, 12).

ఇతర లేఖన భాగాలు ఈ పిలుపును వర్ణిస్తాయి. అపొ. 2:39 దీనిని దేవుని పిలుపు అని అంటుంది. పరిశుద్ధులుగా ఉండడానికి మనం పిలువబడ్డాం (1 కొరింథీ. 1:2). అది పరలోక సంబంధమైన పిలుపు (హెబ్రీ. 3:1).

"బయటికి పిలువబడినవారు" అని అక్షరార్థం యిచ్చే ఒక పదం మనకు క్రొత్త నిబంధనలో ఉంది. ఆ పదమే సంఘం. దానికి గ్రీకు పదం *ekklesia*. అది *Ek* అంటే వెలుపలికి, *kaleo* అంటే "పిలుపు" అనే రెండు పదాల కలయికయై ఉంది. "సంఘం" అంటే అక్షరార్థంగా "బయటికి పిలువబడినవారు." ప్రభువు సంఘము అని మనం అన్నప్పుడు, ప్రభువునకు చెందినవారుగా పిలువబడినవారని భావం. మనం ప్రభువు సంఘంలో సభ్యులమై ఉండాలా లేదా అనే ప్రశ్నను యిది నిర్ణయించాలి. బయటికి పిలువబడడం అవసరమా? అవును! చీకటిలోనుండి ఒక వ్యక్తి వెలుగులోనికి పిలువబడినప్పుడు, అతడు పిలువబడినవారిలో లేక సంఘంలో ఒక భాగమైయుంటాడు.

"మీ పిలుపును, ఏర్పాటును నిశ్చయం చేసికోవలసిందని" 2 పేతురు 1:5-11లో మనం కనుగొంటాం. ఆ లేఖన భాగంలో క్రైస్తవ గుణగణాలను కొన్నింటిని పేతురు ప్రత్యేకించి పేర్కొన్నాడు: పూర్ణ జాగ్రత్త, విశ్వాసము, సద్గుణము, జ్ఞానము, ఆశానిగ్రహము, సహనము, భక్తి, సహోదర ప్రేమ, దయ అనేవి అమర్చుకోవలసిందిగా వారు హెచ్చరింపబడ్డారు. "మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు" అని అన్నాడు (10 వ.). అవును, కృపనుండి క్రైస్తవుడు పడిపోయే అవకాశముంది. అందునుబట్టి మన పిలుపును, ఏర్పాటును నిశ్చయం చేసికొనడానికి మనలో ప్రతి ఒక్కరు జాగ్రత్తపడాలి.